# ప్రమాదకరంగా మూలమలుపు

## కొత్తగట్టుసింగారం రోడ్డుపై వాహనదారుల ఇబ్బందులు



మూలమలుపు వద్ద కమ్ముకున్న ముళ్లచెట్లు

శాయంపేట, అక్టోబర్ 1 : శాయంపేట రైస్ మిల్లు నుంచి కొత్తగట్టుసింగారం స్టేజీ వరకు ప్రభుత్వం రైతులు, ప్రజల సౌకర్యార్థం మూడు కిలోమీటర్లు ప్రత్యేక బీటీ రోడ్డును నిర్మించింది. శాయంపేట నుంచి నేరుగా మాందారిపేట మీదుగా కొత్తగట్టుసింగారాకి రావాలంటే దూరాభారం తప్పడం లేదు. చుట్టూ తిరిగిరావాలంటే ఐదు కిలోమీటర్లు అవుతుంది. కానీ రైస్‌మిల్లు నుంచి కేవలం మూడు కిలోమీటర్ల దూరమే ఉంటుంది. దీంతో మండల పరిధిలోని గ్రామాల నుంచి శాయంపేట మీదుగా వెళ్లే ద్విచక్రవాహనాలు, ఆటోలు, జీపులు, వాహనాలు పెద్ద సంఖ్యలో కొత్తగా నిర్మించిన బీటీరోడ్డు నుంచే వెళ్తున్నాయి. అయితే ఈ రోడ్డు మార్గంలో మూలమలుపులు అధికంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు పలువురు తెలిపారు. దీనికి తోడు ముళ్ల పొదలు భారీగా పెరిగి రోడ్డును కమ్ముకోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులుకానీ, గ్రామ పంచాయతీ సిబ్బంది కానీ వెంటనే ముళ్ల పొదలను తొలగించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

# డబుల్ రోడ్డు పనులు పూర్తి

## హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

శాయంపేట, అక్టోబర్ 1 : శాయంపేట మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఆరెపల్లి శివారు నుంచి శాయంపేట టౌన్ సెంటర్ వరకు డబుల్‌రోడ్డు పనులు జరిగాయి. రోడ్డు పనులు పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ సర్కారు వచ్చిన తర్వాత ప్రతి మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఆత్మకూరు నుంచి శాయంపేట బస్టాండ్ సెంటర్ వరకు రూ.6కోట్లతో డబుల్ రోడ్డును చేపట్టారు. అయితే రెండేళ్ల క్రితమే ఆత్మకూరు నుంచి తిరుమలగిరి, ఆరెపల్లి వరకు డబుల్ బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. శాయంపేట టౌన్‌లో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు వెడల్పుకు మార్కింగ్ ఇవ్వడంతో సుమారు 50మందికిపైగా ఇళ్లను స్వచ్ఛందంగా యజమానులు తొలగించుకున్నారు. దీంతో శాయంపేట శివారు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు డబుల్‌రోడ్డుకు లైన్ క్లియర్ అయింది. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రత్యేక చొరవ చూపి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.90లక్షలు మంజూరు చేయించారు. ఈ క్రమంలో సీసీ డబుల్ రోడ్డు పనులను చేపట్టారు. రోడ్డు వేస్తున్నప్పటికీ సైడ్ డ్రైనేజీలు నిర్మించాలని గ్రామ పంచాయతీ సర్పంచ్‌ను స్థానికులు అడిగారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా జరుగుతున్న డబుల్ రోడ్డు పనులు పూర్తి చేశారు. దీనికి అనుగుణంగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ గండ్ర జ్యోతి బస్టాండ్ సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు శంకుస్థాపన చేశారు. దీంతో శాయంపేట సెంటర్ వెలుగులీననున్నది. దీంతో సర్వత్రా ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



పూర్తయిన రోడ్డు



దామెర చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్‌చైర్‌పర్సన్ సోదా అనితారామకృష్ణ

## స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితారామకృష్ణ

పరకాల, అక్టోబర్ 1 : ప్రజలు స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితారామకృష్ణ కోరారు. ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే వార్డు, పట్టణం, జిల్లా, రాష్ట్రం, దేశమంతా పరిశుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రత పౌరుల సామాజిక బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుణహరి శేషాంజన్‌స్వామి, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు పసుల లావణ్య, శనిగరపు రజిని, చందుపట్ల సుజాత, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : శ్రమదానం చేస్తున్న సర్పంచ్

### గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు..

శాయంపేట/గీసుగొండ/ఆత్మకూరు/ దామెర, అక్టోబర్ 1 : శాయంపేట మండలంలోని నేరేడుపల్లిలో, గీసుగొండ మండలంలోని మరియపురంలో, ఆత్మకూరు మండలంలోని తిరుమలగిరి, ఆత్మకూరు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రమదానం చేశారు. నేరేడుపల్లి సర్పంచ్ ఆకుతోట రాజేశ్, పంచాయతీ కార్యదర్శి రాయకంటి రాజు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆకుతోట సమ్మిరెడ్డి, ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. మరియపురంలో అల్లం బాలిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వీధులను శుభ్రం చేశారు. తిరుమలగిరి, ఆత్మకూరు గ్రామాల్లో సర్పంచులు రంపీస మనోహర్, పర్వతగిరి రాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో చేతన్‌కుమార్‌రెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, కేజీవీబీ ప్రిన్సిపాల్ వాసవి, పంచాయతీ కార్యదర్శులు మేడ యాదగిరి, అనూష, ఉపాధ్యాయులు, జీపీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. దామెర మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రమదానం చేశారు. చెత్తచెదారం, ముళ్లపొదలను తొలగించారు. ఎంపీపీ కాగితాల శంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాంరెడ్డి, ఎంపీడీవో కాసర్ల రవీందర్, ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



మరియపురంలో రోడ్లను శుభ్రం చేస్తున్న మహిళలు

## 'రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'



ఎన్నికైన రెడ్డి సంఘం మండల కమిటీ

ఆత్మకూరు, అక్టోబర్ 1 : పేదరెడ్డి సంక్షేమానికి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని జీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మకూరు మండల ఆత్మీయ సమ్మేళనంలో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైన పేద రెడ్డి సంఘం అభివృద్ధికి రూ.5వేల కోట్ల నిధులతో ప్రత్యేక రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కామిడి సతీశ్, పింగిళి దేవేందర్‌రెడ్డి, బీరం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, జిన్నా రామకృష్ణారెడ్డి, రేవూరి ప్రభాకర్‌రెడ్డి, రేవూరి ప్రవీణ్‌రెడ్డి, రేవూరి జనార్దన్‌రెడ్డి, బీరం రజనీకర్‌రెడ్డి, కరివేద రమణారెడ్డి, కరివేద మహేందర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, 500మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు రెడ్డి సంఘం ఎన్నిక..**

ఆత్మకూరు రెడ్డి సంఘం మండల అధ్యక్షుడిగా రేవూరి సంపత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కాంతాల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఓరుగంటి కరుణాకర్‌రెడ్డి, కంది కిషన్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా వంచ రంగారెడ్డి, కొమ్ముడి మనోహర్‌రెడ్డి, కోశాధికారి గట్టు రవీందర్‌రెడ్డిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తెలిపారు.

## 'ఆధునిక పనిముట్ల అమ్మకాలు అభినందనీయం'



గాలిలోకి డ్రోన్‌ను ఎగురవేస్తున్న మంత్రి దయాకర్‌రావు

కాశీబుగ్గ, అక్టోబర్ 1 : రైతుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని మన అగ్రిటెక్ ఆధ్వర్యంలో ప్రత్యేక రాయితీపై ఆధునిక వ్యవసాయ పనిముట్లు అమ్మకాలు చేయడం అభినందనీయమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మన అగ్రిటెక్ ఎక్స్పో షోరూంను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రోన్ స్ప్రేయర్‌ని ఎగురవేసి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే మన అగ్రిటెక్ ఎక్స్పో నూతన సెమినార్ హాల్‌ను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ప్రారంభించారు. చైర్మన్ పాశికంటి రమేశ్‌ను అభినందించి రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని కోరారు.



సెమినార్‌హాల్‌ను ప్రారంభిస్తున్న బండా ప్రకాశ్

## 'పందుల వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి'

ఆత్మకూరు, అక్టోబర్ 1 : పందుల వ్యాపారి, యూనివర్సిటీ ప్రొఫెసర్ దుగ్యాల రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బయ్య తిరుపతి మాట్లాడుతూ దుగ్యాల రమేశ్ పోషిస్తున్న పందుల దుర్వాసనతోనే ముదిరాజ్‌ల కుల దైవం గుడి నాలుగేళ్ల నుంచి ఆగిపోయిందన్నారు. గత మూడేళ్ల నుంచి గ్రామ పంచాయతీలో గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అవయవదాన పత్రంపై సంతకం చేస్తున్న దయ్యాల దినేశ్

## అవయవదానానికి ముందుకు వచ్చిన దినేశ్

దామెర, అక్టోబర్ 1 : మండలంలోని ఓగులాపురం డీస్నీల్యాండ్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్, ఆరెపల్లికి చెందిన దయ్యాల దినేశ్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని అవయవదానానికి ముందుకువచ్చారు. ఆదివారం అవమవదాన అంగీకార పత్రంపై సంతకం చేసి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దినేశ్ మాట్లాడుతూ అవయవదానం చేయడం గొప్పవరమని, మరణానికి ముందు ఇతరులకు సహాయపడాలనే ఆలోచనతో అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. సమాజహితం కోసం చేస్తున్న తన ఆశయాన్ని మరోతరానికి అందించాలనే లక్ష్యంతో ఈ అవయవదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దయ్యాల మల్లయ్య, దయ్యాల సదానందం, దయ్యాల శోభారాణి, దయ్యాల రాకేశ్‌భాను, బుద్దదేవ్‌సూరజ్, మీన, అధికారులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మెపా రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్

## ముదిరాజ్‌లు ఐకమత్యంతోనే ముందుకు సాగాలి

### మెపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్

పరకాల, సెప్టెంబర్ 1 : రాజకీయాలకు అతీతంగా ముదిరాజ్‌లు ఐకమత్యంతోనే ముందుకు వెళ్లాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ తెలిపారు. మెపా ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని పశువుల సంతలో ఆదివారం ముదిరాజ్‌ల సింహ గర్జన సభను నిర్వహించారు. ముందుగాఅంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి చైతన్య ర్యాలీని నిర్వహించారు. అనంతరం సభలో కొత్తగట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు సంఘటితం కావాలన్నారు. రాజకీయ చైతన్యంతోనే ముదిరాజ్‌లు సమాజంలో ముందువరుసలో నిలువొచ్చని, అందుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ముదిరాజ్ కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ, మెపా రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గీసుగొండ, అక్టోబర్ 1 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొమ్మాలలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. ఖమ్మం జిల్లా టెకులపల్లి కేసీఆర్ టవర్‌కు చెందిన అన్వర్ పాషా (32) కోనాయిమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కెనాల్ పనులకు వచ్చాడు. కొద్ది రోజులుగా పనులు లేకపోవటంతో కొంతమంది తిరిగి వెళ్లిపోయారు. కొంత మంది ఇక్కడే ఉన్నారు. శనివారం సాయంత్రం అన్వర్‌పాషా కు ఫిట్స్ రావటంతో తోటి కూలీలు ప్రైవేట్ వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి మామ సాదిక్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.